## క్లుప్తంగా

### నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

మొయినాబాద్: మండల పరిధిలోని మేడిపల్లి, వీరన్నపేట్, కుత్బుద్దీన్‌గూడ గ్రామాల్లో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సెక్షన్ ఏఈ రాజేష్‌బాబు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్ల కింద చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా వీరన్నపేట్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు, మేడిపల్లి ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ఆయా గ్రామాల రైతులు, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

### రక్తదానం.. మరొకరికి ప్రాణదానం



రక్తదాతలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న సురేశ్, అధ్యాపకులు, వైద్యులు

చేవెళ్ల: రక్తదానం చేయడం అంటే మరొకరికి ప్రాణదానం చేసినట్లేనని సాగర్ గ్రూప్ విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ సురేశ్ అన్నారు. ఊరేళ్ల సమీపంలోని సాగర్ గ్రూప్ విద్యాసంస్థలో సోమవారం ఎమ్ఎన్‌జే ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆంకాలజీ, రీజనల్ క్యాన్సర్ సెంటర్ వారి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో 60 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా రక్తదానం చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్‌లను అందజేశారు. అనంతరం సురేశ్ మాట్లాడుతూ.. 18 ఏళ్ల నుంచి 60 ఏళ్ల లోపు వారు రక్తదానం చేయవచ్చన్నారు. సరైన సమయంలో రక్తం అందక ఎంతో మంది చనిపోతున్నారని వివరించారు. రక్తదానం చేయటం వల్ల ఎలాంటి నష్టం ఉండదని చెప్పారు. చేశారు. ఈకార్యక్రమంలో ప్రొఫెసర్ నరేశ్, విద్యార్థులు వైద్య బృందం, తదితరులు పాల్గొన్నారు.

### గణపతి ఆలయంలో ప్రత్యేక పూజలు



ప్రత్యేక పూజలో పాల్గొన్న నేతలు, పోలీసులు

షాద్‌నగర్: పట్టణంలోని గణపతి ఆలయంలో బీఆర్ఎస్ నేత సత్యనారాయణ ఆధ్వర్యంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్, పట్టణ సీఐ ప్రతాప్‌లింగం పాల్గొన్నారు. ఈ సదర్భంగా వారు మాట్లాడుతూ... సంకటహర చతుర్థి రోజున విఘ్నేశ్వరుడి పూజ నిర్వహిస్తే విఘ్నాలు తొలుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఒగ్గు కిశోర్, రాజేశ్, శ్రీధర్, ప్రభు, అభిలాష్, వెంకటేష్, చంద్రశేఖర్, అర్చకులు వికాస్, బుగ్గేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

### ఉద్యమకారుల ఫోరం ఉపాధ్యక్షుడిగా నర్సింలు



నర్సింలుకు నియామకపత్రం అందజేస్తున్న నాయకులు

మొయినాబాద్: తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మండల ఉపాధ్యక్షుడిగా మేడిపల్లి గ్రామానికి చెందిన ఎం.నర్సింలు నియమితులయ్యారు. ఫోరం చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గం ఇన్‌చార్జి మహేశ్వర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు కుమ్మరి రమేశ్‌లు సోమవారం ఆయనకు సోమవారం నియామకపత్రాన్ని అందజేశారు. అనంతరం నర్సింలు మాట్లాడుతూ.. మండలంలోని తెలంగాణ ఉద్యమకారులకు ప్రభుత్వ సహకారం అందేలా కృషి చేస్తామన్నారు. ఉద్యమకారుల సమస్యల పరిష్కానికి ప్రయత్నిస్తామన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మహిపాల్, జిల్లా నాయకులు అనంతరెడ్డి(కేబుల్‌రాజు), వికారాబాద్ ఇన్‌చార్జి నర్సింహారెడ్డి, చేవెళ్ల మండల అధ్యక్షుడు మల్లేష్, కార్యదర్శి సత్యానంద్ తదితరులు పాల్గొన్నారు.

### సమతుల ఆహారం అందించండి

**జెడ్పీటీసీ దశరథ్‌నాయక్**

కడ్తాల్: విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందించాలని జెడ్పీటీసీ జర్పుల దశరథ్‌నాయక్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని ఎక్వాయిపల్లిలో స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ఆయన పర్యటించారు. ప్రభుత్వ పాఠశాలలోని మధ్యాహ్న భోజనం, వంటగదిని పరిశీలించారు. అంతకు ముందు గ్రామంలోని వైకుంఠధామాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సుగుణ ఎంపీటీసీ ఉమావతి, నాయకులు వీరయ్య, బిక్షపతి, వెంకటేశ్ తదితరులున్నారు.

# ప్రజా సేవకులుగా పనిచేద్దాం

- ఐకమత్యంతో అభివృద్ధి సాధిద్దాం
- మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్ రూరల్: ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రజలకు సేవలకులుగా పనిచేయాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పిలుపునిచ్చారు. ఫరూఖ్‌నగర్ మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ ఖాజాఇద్రీస్ అహ్మద్ అధ్వర్యంలో సోమవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు సమావేశంలో పాల్గొని తమ గ్రామాల సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే మీ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పాలనలో స్థానిక ప్రజాప్రతినిధులు ఎన్నో ఇబ్బందులు పడ్డారని గుర్తు చేశారు. ప్రభుత్వ పాలనలో పారదర్శకత లేక ఎన్నో కష్టాలు చవిచూశారన్నారు. కేసీఆర్ పాలనలో స్థానిక ప్రజాప్రతినిధులకు స్వేచ్ఛ లేదని అబద్రతా భావంతో ఇబ్బందులు పడ్డారన్నారు. గత ప్రభుత్వం నిధులు ఇవ్వకున్నా సర్పంచులు సొంత ఖర్చులతో మౌలిక సదుపాయాలను ఏర్పాటుచేశారన్నారు. సర్పంచ్‌లకు చేసిన పనుల నిధులు మంజూరవ్వక ఇబ్బదులు పడుతున్నారని, సర్పంచ్‌ల బకాయిలను చెల్లిస్తామని హామీ ఇచ్చారు. ప్రజాప్రతినిధులు రాజకీయ కక్షలకు, ఆధిపత్య పోరుకు దూరంగా ఉండాలని చెప్పారు. గ్రామాల అభివృద్ధిపై దృష్టి సారించాలన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ఐకమత్యంతో అభివృద్ధికి పాటుపడాలని సూచించారు. సదరం క్యాంపులను నియోజకవర్గ కేంద్రంలో ఏర్పాటుచేసేలా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని అయన స్థానిక అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు వెంకట్‌రాంరెడ్డి, వైస్ ఎంపీపీ మౌనిక మచ్చేందర్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ బక్కని యాదవ్, ఎంపీడీఓ వినయ్‌కుమార్, తహసీల్దార్ పార్థసారథి, మండల విద్యాధికారి శంకర్ రాథోడ్, ఏపీఎం నగేష్, ఏపీఓ అరుణ, ఎంపీఓ గిరిరాజ్, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

**ప్రజాసంక్షేమమే ధ్యేయం**

రాష్ట్రంలో ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగుతోందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. సోమవారం ఆయన మండల పరిధిలోని బూర్గుల గ్రామంలో నూతనంగా నిర్మించిన పశువైద్య కేంద్రం ప్రారంభంతో పాటు పార్టీ జెండా అవిష్కరణ, కుందేలుకుంటతండాలో గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... గ్రామాల్లో పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని అన్నారు. పంచాయతీల సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామన్నారు. పల్లెల్లో ప్రజలకు కావాల్సిన మౌలిక వసతులను కల్పిస్తామని చెప్పారు. నాయకులు ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు అరుణ శివకుమార్, రవీందర్‌నాయక్, ఎంపీపీ ఖాజా ఇద్రీస్ అహ్మద్, జెడ్పీటీసీ సభ్యుడు వెంకట్‌రాంరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చల్ల శ్రీకాంత్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాలరాజ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

**పాదయాత్రను ప్రారంభించిన ఎమ్మెల్యే**

షాద్‌నగర్: మండల పరిధిలోని రామేశ్వర దేవాలయం నుంచి ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న శ్రీశైల మల్లికార్జున స్వామి దర్శానికి పార్టీవేత్త బండ్ల శివబాబు అధ్వర్యంలో సోమవారం భక్తులు పాదయాత్రను చేపట్టారు. ఈ పాదయాత్రను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ రామేశ్వరంలో ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ భక్తిభావం పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కుమార్‌గౌడ్, అంజియాదవ్, అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## స్వయం ఉపాధితో ఎదగాలి

**ఎంపీపీ రవీందర్ యాదవ్**



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎంపీపీ రవీందర్‌యాదవ్

కేశంపేట: గొల్లకురుమలు స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగాలని ఎంపీపీ ఎల్గనమోని రవీందర్‌యాదవ్ అన్నారు. మండల కేంద్రంలో సోమవారం గొల్లకురుమల సంఘం క్యాలెండర్‌ను సభ్యులతో కలిసి ఎంపీపీ ప్రారంభించారు. అనంతరం అయన మాట్లాడుతూ... గొల్లకురుమలు గతంలో విధంగా కాకుండా షెడ్‌లలో గొర్రెల పెంపకాన్ని ప్రోత్సహించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గొల్లకురుమలకు గత ప్రభుత్వం మాదిరిగా ఆర్థిక ఎదుగుదలకు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో కేశంపేట, ఇప్పలపల్లి, కొత్తపేట సర్పంచ్‌లు తలసాని వెంకట్‌రెడ్డి, ఆంజనేయులు, నవీన్‌కుమార్, ఎంపీటీసీ మల్లేశ్‌యాదవ్, మండల కోఆప్షన్ సభ్యులు జమాల్‌ఖాన్, గొల్లకురుమల సంఘం మండల అధ్యక్షుడు మల్లేష్‌యాదవ్, గోపాల్‌యాదవ్, యాదగిరిరావు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీకి శుభాకాంక్షల వెల్లువ



ఎమ్మెల్సీ కోదండరాంను సన్మానించి పూలమొక్క అందజేస్తున్న టీజేఎస్ నాయకులు

చేవెళ్ల: గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా ఎన్నికైన ప్రొఫెసర్ కొదండరాంను తెలంగాణ జనసమితి చేవెళ్ల నియోజకవర్గం నాయకులు ఘనంగా సన్మానించారు. పూలమొక్కల అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం నగరంలోని ఆయన నివాసానికి వెళ్లిన టీజేఎస్ నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు కొకుంట్ల శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో వెళ్లిన నాయకులు ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. ఆయన్ను కలిసిన వారిలో చేవెళ్ల మోడల్ స్కూల్ అవర్లిబేస్డ్ టీచర్లు రమేశ్, శివకుమార్, శ్రీనివాస్, టీజేఎస్ నాయకులు కొత్త రవి, పల్లె వినయ్‌గౌడ్, శేఖర్, మహేశ్, వెంకటేశ్, శ్రీకాంత్ ఉన్నారు.

## ఎరువుల లెక్క పక్కాగా ఉండాలి

**మండల వ్యవసాయాధికారి మధుసూదన్**



ఓ ఎరువుల దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న ఏఓ మధుసూదన్

కొందుర్గు: ఎరువుల లెక్క పక్కాగా ఉండాలని మండల వ్యవసాయాధికారి మధుసూదన్ సూచించారు. సోమవారం ఆయన డిప్యూటీ తహసీల్దార్ కృష్ణయ్యతో కలిసి మండలంలోని శ్రీరంగాపూర్, రామచంద్రాపూర్, కొందుర్గు గ్రామాల్లో పర్యటించి ఆయా గ్రామాల్లోని విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల దుకాణాలను తనిఖీ చేశారు. ఎరువుల స్టాకు, సేల్ రికార్డులు, బిల్ బుక్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు సాగుచేస్తున్న భూమి అవసరం మేరకే ఎరువులను విక్రయించాలన్నారు. ప్రతీ రైతుకు బిల్లు ఇవ్వడంతోపాటు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. ఎప్పటికప్పుడు స్టాకు వివరాలు నమోదు చేయాలన్నారు. ఎరువులు పక్కదారి పడితే సహించేది లేదన్నారు. పట్ట పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## ప్రతీ కార్యకర్తకు పార్టీ అండ



జ్యోతిని సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

**కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షురాలు జ్యోతి**

శంకర్‌పల్లి: ప్రభుత్వ పథకాలను లబ్ధిదారులకు అందేలా ప్రతీ కార్యకర్త కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షురాలు జ్యోతి అన్నారు. సోమవారం శంకర్‌పల్లి పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మండల విస్తృత స్థాయి సమావేశానికి ఆమె హాజరయ్యారు. పార్టీ నాయకులు ఆమెను సన్మానించారు. ఈ సందర్భంగా జ్యోతి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ప్రతీ కార్యకర్తకు అండగా ఉంటుందన్నారు. పార్టీ బలోపేతానికి ప్రతీ ఒక్కరు శక్తి వంచన లేకుండా పనిచేయాలన్నారు. కష్టపడిన వారికి పార్టీ పదవులు వరిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జనార్ధన్‌రెడ్డి, ఎజాస్, రవీందర్‌రెడ్డి, పెంటయ్య, షారు, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## దాతల చేయూత అభినందనీయం



పదోతరగతి విద్యార్థులతో జెడ్పీటీసీ, ఎంఈఓ, ఉపాధ్యాయ బృందం

- మండల విద్యాధికారి అక్బర్
- డిగ్రీ కళాశాలలో బెంచీల ఏర్పాటుకు రూ.5 లక్షల సాయం
- పదోతరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

చేవెళ్ల: ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు చేయూతనిచ్చేందుకు దాతలు ముందుకు రావడం అభినందనీయమని మండల విద్యాధికారి అక్బర్ అన్నారు. జెడ్పీటీసీ సభ్యురాలు మర్పల్లి మాలతికృష్ణారెడ్డి చేవెళ్ల, అంతారం, కొకుంట్ల జెడ్పీహెచ్ఎస్‌లో పదోతరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లో జెడ్పీటీసీ, ఎంఈఓ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ప్రైవేటు పాఠశాలలకు దీటుగా రాణించాలని సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలన్నారు. విద్యార్థులు ఉన్నతంగా రాణించి పాఠశాలకు, తల్లిదండ్రలకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు.

**రూ.5లక్షల చెక్కు అందజేత**

చేవెళ్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల నూతన భవనంలో విద్యార్థులకు ఫర్నీచర్ కోసం జెడ్పీటీసీ సభ్యురాలు మాలతి రూ.5లక్షల ఆర్థికసాయం అందజేశారు. సోమవారం చేవెళ్లకు వచ్చిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, చేవెళ్ల ఎంపీ డాక్టర్ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి చేతుల మీదుగా కళాశాల ప్రిన్సిపాల్‌కు ఈ చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీని కేటీఆర్, ఎంపీ, ఎమ్మెల్సీలు అభినందించారు. విద్యాభివృద్ధికి ప్రతీ ఒక్కరు ముందుకు రావావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులున్నారు.

## వైభవంగా బోనాలు

మొయినాబాద్‌రూరల్: రెండేళ్లకు ఒకసారి నిర్వహించే మైసమ్మ బోనాల ఉత్సవాలు రెండు రోజులుగా వైభవంగా కొనసాగుతున్నాయి. ఎన్కేపల్లిలో నిర్వహిస్తున్న ఈ ఉత్సవాలకు ఎంపీటీసీ సభ్యుడు రితీశ్‌రెడ్డి, ఉపసర్పంచ్ వెంకటమ్మ, కాంగ్రెస్ జిల్లా నాయకుడు అమర్‌నాథ్‌రెడ్డి, గ్రామస్తులు చందనచంద్రయ్య, భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయించారు. ఆలయం వద్ద బోనాల ఊరేగింపు, కల్లు ఘటాలు, పోతురాజుల విన్యాసాలు భక్తులను ఆకట్టుకున్నాయి.

# పల్లెప్రగతితో గ్రామాల్లో వెలుగులు

**షాబాద్ జెడ్పీటీసీ సభ్యుడు అవినాశ్‌రెడ్డి**



షాబాద్: చర్లగూడ గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న అవినాశ్‌రెడ్డి, సర్పంచ్ పుష్పమ్మ



అప్పోజీగూడ గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ రాజు

షాబాద్: పల్లె ప్రగతి కార్యక్రమం ద్వారా చేపట్టిన పనులతో గ్రామాలు కొత్త శోభను సంతరించుకున్నాయని షాబాద్ జెడ్పీటీసీ సభ్యుడు పట్నం అవినాశ్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన మండల పరిధిలోని చర్లగూడలో సర్పంచ్ పుష్పమ్మతో కలిపి గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అవినాశ్‌రెడ్డి మాట్లాడుతూ.. పంచాయతీల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామన్నారు. పల్లెప్రగతిలో నిర్మించిన వైకుంఠ ధామం, క్రీడాప్రాంగణం అందుబాటులోకి తీసుకువచ్చామని గుర్తు చేశారు. గ్రామంలోని అన్ని కాలనీలకు సీసీ రోడ్లు, యూజీడీ నిర్మాణం చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ గూడూరు నర్సింగ్‌రావు, మాజీ చైర్మన్ వెంకటయ్య, ఎంపీటీసీ మధూకర్‌రెడ్డి, నాయకులు రాజేందర్‌రెడ్డి, బల్వంత్‌రెడ్డి, తదితరులున్నారు.

**అభివృద్ధి చేసి చూపాం: సర్పంచ్ రాజు**

మొయినాబాద్: గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశామని అప్పోజీగూడ సర్పంచ్ గొర్కంటి రాజు అన్నారు. అప్పోజీగూడలో ఎన్ఆర్ఈజీఎస్, జీపీ నిధులతో నిర్మించిన గ్రామ పంచాయతీ నూతన భవనాన్ని ఆయన సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ కొత్తగా ఏర్పడిన గ్రామ పంచాయతీని ఐదేళ్లలో అన్ని రంగాల్లో అభివృద్ధి చేశామన్నారు. అభివృద్ధికి అవసరమైన నిధులను రాబట్టామన్నారు. మండలంలో కొత్తగా ఏర్పడిన ఏడు గ్రామ పంచాయతీల్లో నూతన పంచాయతీ భవనం నిర్మించింది అప్పోజీగూడలోనే అన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ సురేశ్, వార్డు సభ్యులు హరిత, రాజు, సంధ్య, లత, స్వర్ణలత, కృష్ణ, కోఆప్షన్ సభ్యులు కృష్ణారెడ్డి, వీరేష్, పద్మ, పంచాయతీ కార్యదర్శి జ్యోత్స్న, గ్రామస్తులు పాల్గొన్నారు.

## అండగా ఉంటా.. అధైర్యపడొద్దు

**షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్**



ఉత్తరాసిపల్లిలో మాట్లాడుతున్న అంజయ్యయాదవ్

కొందుర్గు: కార్యకర్తలు అధైర్యపడవద్దని, ఏ ఆపద వచ్చినా తాను అండగా ఉంటానని మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ భరోసానిచ్చారు. సోమవారం ఆయన మండల పరిధిలోని అయోధ్యాపూర్‌తండా, చిన్నఎల్కిచర్ల, పులుసుమామిడి, పర్వతాపూర్, మహదేవ్‌పూర్, బైరంపల్లి, ఉత్తరాసిపల్లి, ముట్పూ ర్, రేగడిచిల్కమర్రి, లాలపేట, ఉమ్మెంత్యాల గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో కార్యకర్తలతో సమావేశం ఏర్పాటుచేసి మాట్లాడారు. ఎన్నికల్లో గెలిచినా, ఓడిన బీఆర్ఎస్ ప్రజలకు అండగా ఉంటుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీల అమలుకు పోరాటం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి, వైస్ ఎంపీపీ రాజేశ్‌పటేల్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గాంధీ మార్గంలో నడుద్దాం

**ప్రొఫెసర్ ప్రసాద్ గొల్లన్నపల్లి**

మొయినాబాద్‌రూరల్: విద్యార్థులు సన్మార్గంలో నడవాలని గాంధీ కింగ్ ఫౌండేషన్ సంస్థ మేనేజింగ్ ట్రస్ట్ చైర్మన్ ప్రొఫెసర్ ప్రసాద్ గొల్లన్నపల్లి, మేనేజింగ్ ట్రస్ట్ ఆఫ్ గాంధీ కింగ్ ఫౌండేషన్ డాక్టర్ శ్రీరామ్‌శెట్టి అన్నారు. సోమవారం మండల పరిధిలోని తోల్‌కట్ట సమీపంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ చేవెళ్ల గురుకుల బాలికల పాఠశాల, కళాశాలను గాంధీ కింగ్ ఫౌండేషన్ సంస్థ వారు సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల, కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. విద్యార్థులు ఉన్నతంగా ఎదిగేలా ఉపాధ్యాయులు ప్రేరేపించాలని సూచించారు. హింసా మార్గాన్ని వీడి మహాత్మాగాంధీ చూపిన మార్గంలో ముందుకు వెళ్లాలన్నారు. పాల్గొన్న వారిని కళాశాల ప్రిన్సిపల్ రమాదేవి సన్మానించి మాట్లాడుతూ విద్యార్థులు శాంతియుతంగా సామరస్యంతో దేనినైనా సాధించవచ్చునని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ క్రాంతి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## తల్లిదండ్రులు దైవంతో సమానం

**సంత్ శ్రీ ఆశ్రమం నిర్వాహకుడు డాక్టర్ అమర్‌నాథ్**



విద్యార్థులను ఆశీర్వదిస్తున్న తల్లిదండ్రులు

షాబాద్: తల్లితండ్రులను దైవసమానులుగా గౌరవించినప్పుడే సమాజం బాగుపడుతుందని సంత్ శ్రీ ఆశ్రమం నిర్వాహకులు డాక్టర్ అమరనాథ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని పీఆర్ఆర్ మినీ స్టేడియంలో సంత్ శ్రీఆశారాంజీబాపు ఆశ్రమం, యోగా వేదాంత సేవా సమితి ఆధ్వర్యంలో గత 18 సంవత్సరాలుగా తల్లితండ్రులకు మాతాపిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి మండల పరిధిలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు తల్లిదండ్రులతో హాజరయ్యారు. ఈ సందర్భంగా అమరనాథ్ మాట్లాడుతూ... పిల్లలు పాశ్చాత్యపోకడలకు పోకుండా, వారికి భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలను నేర్పించాలన్నారు. యువత వ్యసనాలకు బానిసలుగా మారుతున్నందున దేశం పతనమవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. బాలుర పాఠశాల ప్రధానోపాధ్యాయులు నర్సింహులు మాట్లాడుతూ.. తల్లిదండ్రుల విలువను విద్యార్థి దశ నుంచే వివరించి పిల్లలకు తల్లితండ్రులంటే దైవంతో సమానమనే భావన కల్పించేందకు ప్రతి ఒక్కరూ కషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు రాజేందర్, పరమేశ్వర, శరత్, మనోజ్, కార్యకర్తలు తదితరులున్నారు.

## గ్రామాభివృద్ధికే కృషి చేశాం

**అజీజ్‌నగర్ సర్పంచ్ సంధ్య**



సర్పంచ్, వార్డు సభ్యులను సన్మానిస్తున్న అజీజ్‌నగర్ పంచాయతీ సిబ్బంది

మొయినాబాద్‌రూరల్: అజీజ్‌నగర్ గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ఐదేళ్లుగా పని చేశానని అజీజ్‌నగర్ సర్పంచ్ బండ్లగూడ సంధ్యాశ్రీశైలం అన్నారు. సోమవారం మండల పరిధిలోని అజీజ్‌నగర్ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్‌లు, వార్డు సభ్యులకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డు సభ్యులను, సర్పంచ్‌ను ఘనంగా సన్మానించారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ.. సర్పంచ్ పదవీ రెండు రోజుల్లో ముగియనుందని తెలిపారు. ఐదేళ్ల పాటు అందరితో కలిసి రాజకీయాలకతీతంగా గ్రామ అభివృద్ధే లక్ష్యంగా పని చేశామన్నారు. తనను గెలిపించిన గ్రామస్తులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు కొండల్‌రెడ్డి, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.